క్లుప్తంగా

గోదాం నిర్మాణానికి నిధులు కేటాయించాలి



మంత్రి కేటీఆర్‌తో కిషన్‌రెడ్డి

బోయినపల్లి: మండలంలోని కోరెం సింగిల్‌విండోలో గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌కు, జిల్లా సింగిల్‌విండోల ఫోరం అధ్యక్షుడు తీపిరెడ్డి కిషన్‌రెడ్డి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. రైతులు పండించే వరి పంటలకు ఇపుడు ఉన్న గోదాంలు సరిపోవడం లేదని, కోరెం గ్రామంలో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. గోదాం నిర్మాణానికి మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.

హైజినిక్ కిట్లు అందజేత



హైజినిక్ కిట్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామంలో వర్షాలతో ఇళ్లు ఉరుస్తున్న వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు టార్పలిన్, పేద విద్యార్థినులకు హైజినిక్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పద్మనగర్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుడ్ల రవి, వైస్ చైర్మన్ ప్రయాకర్ రావు వేణుకుమార్, కార్యదర్శి శివ, కోశాధికారి గుడిమె శివప్రసాద్ పాల్గొన్నారు.

హైలెవల్ బ్రిడ్జికై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట: ఎడతెరిపిలేని వర్షాలకు గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై లోలెవల్ వంతెన నీట మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన కోసం ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం నీట మునిగిన బ్రిడ్జి దగ్గర నిరసన వ్యక్తం చేశారు. గతంలో ఆర్టీసీ బస్సు కొట్టుకుపోయినా పాలకుల్లో చలనం లేదన్నారు. నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరగా హైలెవల్ వంతెన నిర్మించి ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చాలని కోరారు. మండల శాఖ అధ్యక్షుడు హమీద్, నాయకులు పాల్గొన్నారు.

వర్షం మిగిల్చిన నష్టం

జిల్లాలో ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలు నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఒకవైపు రైతుల పంటపొలాల్లో నీరు వచ్చి చేరింది. ఇసుకమేటలతో నిండింది. మరోవైపు రోడ్లు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. వరదనీరు ఇళ్లలోకి చేరి నానా భీభత్సం సృష్టించింది. ఎటు చూసినా నీరే కనిపించింది. అయితే ఏ ఒక్క చోట ప్రాణనష్టం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం విశేషం.



కోనరావుపేట: బావుసాయిపేట మూలవాగులో కొట్టుకుపోయిన కాజ్‌వే



పొలాల్లో ఇసుక మేటలను పరిశీలిస్తున్న ఏవో

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని మూలవాగు చెక్‌డ్యామ్ పక్కన వరద నీటితో సుమారుగా 60 ఎకరాలు పంట పొలాలకు నష్టం జరిగిందని ఏవో సాయి కిరణ్ తెలిపారు. పంట పొలాల్లో ఇసుక మేటలు పెట్టాయి. అలాగే వరదనీరు నిలిచి సుమారుగా 20 ఎకరాలు పంట నష్టం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గని వరద.. ఆగిన రవాణా

వేములవాడ: భారీ వర్షాల కారణంగా వరద భీభత్సం కొనసాగింది. శుక్రవారం సైతం వరద తీవ్రత తగ్గకపోవడంతో అధికార యంత్రాంగం రవాణాకు ఇంకా అనుమతులు ఇవ్వడం లేదు. రోడ్డుకు అడ్డగా ట్రాక్టర్లు, బారికేడ్లు పెట్టి రవాణాను నిలిపివేశారు.

215 ఎకరాల్లో పంట నష్టం

బోయినపల్లి: మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలో 215 ఎకరాల మేర పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఎంఏవో ప్రణీత తెలిపారు. బోయినపల్లి, తడగొండ, మల్లాపూర్ గ్రామాల్లో ఇసుక మేటలు వేసిన పంటలను గుర్తించినట్లు తెలిపారు. ఆమె వెంట ఏఈవో శ్రీదేవి రైతులు ఉన్నారు.

కూలిన పశువుల షెడ్డు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి శివారులోని మూలవాగు పక్కన ఉన్న రైతు జడల చిన్న శ్రీనివాస్ పశువుల షెడ్డు వరద నీటి ప్రవాహానికి కూలింది. మూలవాగు చెక్‌డ్యామ్ ఏర్పాటు వల్ల వరద తాకిడి పక్కకు మళ్లీ మూడు ఎకరాల వరి పంట నష్టం జరిగిందని, పశువుల రేకుల షెడ్డు వరదలో కొట్టుకుపోయినట్లు రైతు బోరుమన్నాడు.

దెబ్బతిన్న ఇళ్లు

బోయినపల్లి: వర్షాలకు కూలిపోయిన, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను ఆర్ఐ ప్రభాకర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. వర్షాలకు మర్లపేటలో 3, మల్కాపూర్, అనంతపల్లి, మాన్వాడ గ్రామాల్లో ఒక్కో ఇల్లు చొప్పున కూలిపోయినట్లు ఆర్ఐ ప్రభాకర్ తెలిపారు. అలాగే కొన్ని గ్రామాల్లో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

కూలిన ఇళ్లు

కోనరావుపేట: మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన కొండం దేవనర్సయ్య, లక్కె పద్మ, అక్కెనపల్లి మైసయ్య, కడకుంట్ల నర్సయ్య, మునిగంటి పద్మ, ఉదారపు ఇంద్రవ్వల ఇళ్లు వర్షాలకు కూలిపోయాయి. ఇదే గ్రామానికి చెందిన ఇప్పపూల సుమన్ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది.

కోనరావుపేట: మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన కొండం దేవనర్సయ్య, లక్కె పద్మ, అక్కెనపల్లి మైసయ్య, కడకుంట్ల నర్సయ్య, మునిగంటి పద్మ, ఉదారపు ఇంద్రవ్వల ఇళ్లు వర్షాలకు కూలిపోయాయి. మల్కపేటలో జవ్వాజి దేవయ్యగౌడ్ ఇల్లు కూలింది. మరిమడ్లలో ఇప్పపూల సుమన్ ఇల్లు, మల్కపేటలో జిల్లా సతీష్ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. బాధితులకు పరిహారం అందించాలని నాయకులు కుమ్మరి దిలీప్‌కుమార్ కోరుతున్నారు.

రోడ్లు, కల్వర్టులు ధ్వంసం



కథలాపూర్ వద్ద ధ్వంసమైన రోడ్డు

వేములవాడ: భారీ వర్షాల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. కల్వర్టులు కొట్టుకుపోయి భారీ గుంతలు ఏర్పడ్డాయి. వరద తాకిడికి రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. వేములవాడ పట్టణ శివారులోని మల్లారం రోడ్డు, శాత్రాజుపల్లి రోడ్డు, బోయిన్‌పల్లి రోడ్డులోని కల్వర్టులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అవస్థలు పడుతున్న జనం

కల్వర్టులపై రోడ్డు దెబ్బతినడంతో ద్విచక్ర వాహదారులు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజులుగా ఇంటికే పరిమితమైన గ్రామీణులు శుక్రవారం వేములవాడకు చేరుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. బోయిన్‌పల్లి–వేములవాడ, వేములవాడ–హన్మాజీపేట రాకపోకలు లేక దూర ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకున్నారు. తమతమ అవసరాల మేరకు సామాన్లు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. వరదల కారణంగా ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు బోసిపోయి కనిపించాయి. వ్యాపారాలు పూర్తిగా స్తంభించిపోయాయి.

కొట్టుకుపోయిన కాజ్‌వే

కోనరావుపేట: మండలం బావుసాయిపేట–వెంకట్రావుపేట గ్రామాల మధ్య మూలవాగుపై ఉన్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో రవాణాకు అంతరాయం ఏర్పడింది. బావుసాయిపేట నుంచి కోనరావుపేటకు వెళ్లాలంటే ఇదే రహదారి. వెంకట్రావుపేట మీదుగా కోనరావుపేటకు వెళ్లడానికి దగ్గరి దారి. వర్షాలకు వాగుపై ఉన్న కాజ్‌వే కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

రోడ్లకు మరమ్మతులు చేపడతాం

- నష్టపోయిన రైతులకు పరిహారం అందజేస్తాం
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



ఎన్గల్‌లో కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చందుర్తి(వేములవాడ): వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను త్వరలోనే మరమ్మతులు చేస్తామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. చందుర్తి మండలంలోని లింగంపేట, కట్టలింగంపేట, ఎన్గల్ గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను శుక్రవారం పరిశీలించారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ అతివృష్టితో కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, వరద ముప్పు రాకుండా ఉండేలా హైలెవల్ వంతెనల నిర్మాణాలు చేపట్టేందుకు రెండు రోజుల్లో సమావేశం ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఇప్పటికే ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భారీ వర్షాలకు ఇసుకమేటలు, కోతకు గురైన పంట పొలాల సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు. వరదలకు ఎమ్మెల్యే నిర్లక్ష్యమే కారణమని కొందరు ప్రతిపక్ష నాయకులు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, సెస్ చైర్మన్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దప్పుల అశోక్, మండల కో–ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, సర్పంచులు దప్పుల లక్ష్మి, ఏనుగుల జమున, లింగంపల్లి సత్తయ్య, దుమ్ము అంజయ్య, లింగంపల్లి కరుణాకర్, అంబిరి కల్పన, నాయకులు బైరగోని రమేశ్, పోతురాజు నాగేశం, ఎంపీటీసీ సభ్యులు మాదాసు కవిత, ప్రసాద్ పాల్గొన్నారు.

పరిహారం అందిస్తాం

కోనరావుపేట: వర్షాలకు నష్టపోయిన రైతులకు, ఇళ్లు నీటమునిగిన బాధితులకు పరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లిని సందర్శించి వరద బాధితులతో మాట్లాడారు. మామిడిపల్లి మూలవాగులో చెక్‌డ్యాం పనులు పూర్తికాకపోవడంతో వరద ఎస్సీకాలనీకి వచ్చిందన్నారు. ఇసుకరీచ్‌లు కూడా తొలగించేందుకు అధికారులతో మాట్లాడుతామన్నారు. ఎస్సీ కాలనీ బాధితులకు గృహలక్ష్మి పథకం లబ్ధిదారులుగా చేరుస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ చంద్రయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సర్పంచులు కొక్కుల భారత, కెంద గంగాధర్, సర్పంచుల ఫోరం కన్వీనర్ గోపు పర్శరాములు ఉన్నారు.

బాధితులను ఆదుకుంటాం

ఎల్లారెడ్డిపేట: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులను ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని తహసీల్దార్ జయంత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో వర్షాలకు కూలిన ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో మొత్తం 37 ఇళ్లు వర్షాలకు కూలిపోయాయని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో పునరావాసం కల్పించినట్లు తెలిపారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రహదారులకు మరమ్మతులు

కోనరావుపేట: భారీ వర్షాలకు ఒర్రెలు పొంగి కోతకు గురైన రహదారులను పోలీసులు బాగు చేయించి రవాణాను పునరుద్ధరించారు. మండలంలోని నాలుగు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు కొండాపూర్ పెంటివాగు పొంగిపొర్లి రహదారి కోతకు గురైంది. నిమ్మపల్లి నుంచి అజ్మీరాతండాకు వెళ్లే దారిలో వంతెన కింద బుంగ ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు, స్థానికుల సాయంతో జెసీబీతో మట్టిని పోయించారు. నిమ్మపల్లిలో బుంగను పూడ్చివేయించారు. సర్పంచులు రాములునాయక్, శ్రీనివాస్, ఉపసర్పంచ్ దొంతరవేణి శ్రీనివాస్‌గౌడ్, రైతుసమితి అధ్యక్షుడు గోగు ప్రతాపరెడ్డి, కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చెరువులను పరిశీలించిన ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల చెరువులను శుక్రవారం తంగళ్లపల్లి ఎంపీపీ పడిగెల మానస అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంపీడీవో పి.లచ్చాలు, ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఈ రాహులి, సర్పంచులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో పొలాల వద్ద కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి మరమ్మతు చేయించారు. బందనకల్‌లో వ్యవసాయ క్షేత్రాల వద్ద కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది 24 గంటల్లో బిగించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలి

ముస్తాబాద్: అతివృష్టితో నష్టపోయిన రైతులను, ఇల్లు కోల్పోయిన బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆవునూర్, పోతుగల్, గూడెం గ్రామాల్లో వర్షానికి ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించారు.

బాధిత కుటుంబానికి సాయం

కోనరావుపేట: మండలం మామిడిపల్లిలో బడుగు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ముస్తాబాద్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు అరికట్టేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని వైద్యాధికారి బత్తుల గీతాంజలి అన్నారు. ముస్తాబాద్ మండలం గూడెం, నామాపూర్, పోతుగల్ గ్రామాల్లో శుక్రవారం డ్రైడే నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

ఎల్లారెడ్డిపేట: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి శుక్రవారం పాలకవర్గ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతిరోజు ఫాగింగ్ చేయాలని, నీటి కొరత లేకుండా చూడాలని, విద్యుత్ దీపాలను అమర్చాలన్నారు. కిషన్‌దాస్‌పేట నుంచి కోరుట్లపేట వెళ్లే రహదారిలో కూలిపోయే దశలో ఉన్న బ్రిడ్జి మరమ్మతు కోసం తీర్మానించారు. ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, వార్డు సభ్యులు, కార్యదర్శి దేవరాజు పాల్గొన్నారు.

కూలిపోయిన ఇళ్ల పరిశీలన

వీర్నపల్లి: మండల కేంద్రంలో వర్షానికి కూలిపోయిన ఇళ్లను ఎంఆర్‌వో తఫాజుల్ హుస్సేన్ శుక్రవారం పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 25 ఇళ్లు కూలిపోయినట్లు తెలిపారు. ఇళ్లు కూలిపోయిన వారు ఇంటి ఫొటో, ఆధార్, రేషన్ కార్డు, కార్యదర్శి ధ్రువీకరణ పత్రంతో ఎంఆర్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం అందించాలి

ముస్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి అన్నారు.

ముంపు సమస్యలను పరిష్కరించాలి

బోయినపల్లి: మిడ్‌మానేరు ముంపు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని నీలోజిపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ యువకులు సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్ కుమార్‌ను కోరారు. గ్రామపంచాయతీ ఐదో వార్డు సభ్యుడు సింగిరెడ్డి బాలమల్లు ఆధ్వర్యంలో శుక్రవారం సిరిసిల్ల నూతన ఆర్డీవో ఆనంద్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. అలాగే యువతుల ప్యాకేజీ అందించాలని కోరారు.

బతుకులు మారాలంటే బీఎస్పీ రావాలి

బోయినపల్లి: బహుజనుల బతుకులు మారాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ చొప్పదండి అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్ అన్నారు. ఆగస్టు 6న చొప్పదండిలో జరిగే బహుజన రణభేరి విజయవంతం కోసం రూపొందించిన పోస్టర్‌ను మండల అధ్యక్షుడు అలువాల అజయ్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అలువాల అజయ్, సెక్టార్ అధ్యక్షుడు బొడ్డు రాజలింగంబాబు, నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్బీ సీఐ అనిల్‌కుమార్



ఎస్పీని కలిసిన ఎస్బీ సీఐ అనిల్‌కుమార్

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల స్పెషల్ బ్రాంచ్ సీఐగా అనిల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్లకుపైగా సిరిసిల్లటౌన్ సీఐగా విధులు నిర్వహించిన అనిల్‌కుమార్‌ను ఇటీవల జరిగిన బదిలీల్లో ఎస్బీ బ్రాంచ్‌కి కేటాయించారు. ఈమేరకు శుక్రవారం ఎస్పీ అఖిల్ మహాజన్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

ఆర్యవైశ్య మహాసభ ఈసీ మెంబర్‌గా పవన్‌కుమార్



ఉత్తర్వులు అందజేస్తున్న లక్ష్మీనారాయణ

వేములవాడ: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ ఈసీ మెంబర్‌గా వేములవాడకు చెందిన తాటికొండ పవన్‌కుమార్‌ను రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా తనను నియమించిన కార్యవర్గానికి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

సైబర్ మోసం.. రూ.2.06 లక్షలు మాయం

సిరిసిల్లక్రైం: గుర్తు తెలియని వ్యక్తి 88520 97920 నంబర్ నుంచి వాట్సాప్‌లో పార్ట్ టైమ్ జాబ్ ఉందని నమ్మబలికి ఏకంగా రూ.2.06 లక్షల కాజేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణం కొత్తబస్టాండ్ ఏరియాకు చెందిన బొద్దుల సాయిరాజ్‌కు ఒక నంబర్ నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. టాస్క్ ఫ్రీలాన్స్ అనే టెలిగ్రాం అప్లికేషన్‌లో పలు పనులు అప్పగించినట్లు చెబుతూ మోసగాడు పలు దఫాలుగా డబ్బులు దండుకున్నాడు. తర్వాత తను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ చేస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌కు చెందిన వంశీ తన భూమిలో పనిచేస్తుండగా కొందరు వచ్చి కులంపేరుతో దూషించారని వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 18న ఫిర్యాదు చేశాడు. దీనిపై డీఎస్పీ నాగేంద్రచారి శుక్రవారం విచారణ చేపట్టారు. సాక్షులను విచారించారు.

ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు

సిరిసిల్లక్రైం: లారీని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబికానగర్‌కు చెందిన వేముల రాజేందర్ తంగళ్లపల్లి నుంచి బైక్‌పై సిరిసిల్లకు వస్తున్నాడు. ఇదే సమయంలో సిరిసిల్ల కొండాలక్ష్మణ్ బాపూజీ సర్కిల్ వద్ద లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో రాజేందర్ కాలుకు గాయమైనట్లు వచ్చిన ఫిర్యాదుతో లారీ డ్రైవర్ నగేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

నూతన విద్యా విధానంతో గుణాత్మక విద్య

సిరిసిల్లఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం 2020తో విద్యార్థులకు గుణాత్మక విద్య అందుతుందని సిరిసిల్ల కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ వై సురేందర్ శుక్రవారం అన్నారు. నూతన విద్యా విధానం అమలులోకి వచ్చి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం సిరిసిల్ల కేంద్రీయ విద్యాలయంలో వార్షికోత్సవాన్ని నిర్వసించారు. 1986 నూతన విద్యా విధానం తర్వాత వచ్చినదే జాతీయ విద్యా విధానం 2020 అని పాఠశాల విద్యా విధానంలో కొన్ని మార్పులు చేశారన్నారు.

నిరసనలు.. సంఘీభావాలు



వీర్నపల్లిలో ఖాళీ గిన్నెలతో పంచాయతీ కార్మికుల నిరసన

వీర్నపల్లి/కోనరావుపేట/తంగళ్లపల్లి/ముస్తాబాద్: గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె శుక్రవారం 23వ రోజుకు చేరింది. ఒకవైపు నిరసన ప్రదర్శనలు, మరోవైపు సంఘీభావం వ్యక్తం చేస్తున్న నాయకుల హడావుడి ప్రతీ శిబిరం వద్ద కొనసాగుతోంది. వీర్నపల్లిలో పంచాయతీ కార్మికులు ఖాళీ గిన్నెలతో నిరసన తెలుపగా, కోనరావుపేటలో చెవిలో పువ్వులతో నిరసన ప్రదర్శన చేశారు. ముస్తాబాద్‌లో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు దీక్ష శిబిరం వద్దకు వెళ్లి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి కేటీఆర్ దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్తామన్నారు. దీక్ష శిబిరాలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ వంగ కరుణ
- గంభీరావుపేట మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వంగ కరుణ

గంభీరావుపేట: మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎంపీపీ వంగ కరుణ అన్నారు. గంభీరావుపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి అవగాహన కల్పించాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రతిసారి అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. ఎడతెరిపి లేని వర్షాలకు చెరువులు, కుంటలు, వాగులు నిండి ప్రవహిస్తున్నాయని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ దోసల లత, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం

సిరిసిల్లఅర్బన్: అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతోనే వర్షాలు పడినప్పుడల్లా జిల్లా కేంద్రంలో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని బీఎస్పీ జిల్లా కమిటీ సభ్యుడు అరుకాల రమేశ్ అన్నారు. లోతట్టు ప్రాంతాలను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్య ధోరణితో మూడేళ్ల నుంచి వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నారు. అభివృద్ధి పేరుతో కోట్లు కొల్లగొట్టి ఎక్కడి సమస్యలు అక్కడే పెడుతున్నారన్నారు. మంత్రి కేటీఆర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కరీంనగర్‌లో శనివారం జరిగే బీఎస్పీ మహిళా సదస్సు కార్యక్రమానికి మహిళలు తరలి రావాలన్నారు.

'పర్యవేక్షణ లేకనే చెరువు కట్ట తెగింది'

సిరిసిల్లటౌన్: సారూ.. మున్సిపల్ విలీన గ్రామాల్లో ఉపాధిహామీ పనులు రద్దయినయ్.. పర్యవేక్షణ లేకనే సిరిసిల్ల శివారులోని బోనాల చెరువు కట్ట గురువారం తెగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.. వందలాది ఎకరాల్లో పొలాలు నీటమునిగాయని, సిరిసిల్ల పట్టణానికి వరద పోటెత్తిందని వాపోయారు.. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య శుక్రవారం చెరువు పరిశీలనకు వెళ్లగా సమస్యలను ఏకరువు పెట్టారు. మున్సిపల్ ద్వారా చెరువుల పర్యవేక్షణ చేపట్టాలని, లేనిపక్షంలో విలీన గ్రామాల్లో ఉపాధిహామీ పనులు నిర్వహించాలని కోరారు. తమకు తీరని నష్టం జరిగిందని, సర్కారు తరఫున ఆదుకొని, చెరువు కట్టను పునరుద్ధరించాలని విన్నవించారు. స్పందించిన ఆయన చెరువు కట్టను వెంటనే పునరుద్ధరించి, రైతులకు, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డికి సూచించారు. బీఆర్‌ఎస్ నాయకుడు పాషాఖాన్, రైతులున్నారు.